సాక్షి
ఖమ్మం

7

మంగళవారం । 14 । ఫిబ్రవరి । 2023



కేవలం ప్రేమ మాత్రమే వారిని ముందుకు నడిపించింది. ప్రస్తుతం ప్రేమ వివాహాలు సాధారణమై పోయినా.. ఏళ్ల క్రితం కులం కట్టుబాట్లు, ఆర్థిక అసమానతలు.. ఇలా ఎన్నో అడ్డంకులు ఎదురయ్యేవి. కానీ వారు మాత్రం ధైర్యంగా ముందడుగు వేశారు. ఇబ్బందులు పడినా పట్టుకున్న చేయి వీడ లేదు. ఉన్నంతలో సర్దుకుంటూ కుటుంబాలను వెళ్లదీస్తూ జీవన పయనంలో ముందుకు సాగారు. ఆ తర్వాత కొన్నాళ్లకు పెద్దలు చేరదీయడంతో కథ సుఖాంతం కాగా.. ఆదర్శ జంటలుగా సమాజంలో మంచి పేరు సంపాదించారు. నేడు 'ప్రేమికుల దినోత్సవం' సందర్భంగా ప్రేమించుకుని జంటలుగా మారిన కొందరి సక్సెస్ స్టోరీలు... –సాక్షి నెట్‌వర్క్

న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరించిన న్యాయమూర్తులు



రాంప్రసాద్‌రావు అపర్ణ అర్చనాకుమారి

ఖమ్మం లీగల్: ఖమ్మం ప్రత్యేక షెడ్యూలు తెగలు, షెడ్యూలు కులాల ప్రత్యేక న్యాయస్థానం, మూడో అదనపు జిల్లా న్యాయమూర్తిగా దేవినేని రాంప్రసాద్‌రావు, రెండో అదనపు జిల్లా న్యాయమూర్తిగా వేంపటి అపర్ణ, కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తిగా మందా అర్చనా కుమారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. హైకోర్టు నిర్వహించిన జిల్లా జడ్జి పరీక్షలో అర్హత సాధించి వీరు ఖమ్మం కోర్టులో తొలిసారిగా విధుల్లో చేరారు. ఈమేరకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొల్లపూడి రామారావు తదితరులు నూతన న్యాయమూర్తులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

16న జిల్లాకు వైఎస్.విజయమ్మ

వైఎస్సార్‌టీపీ కార్యాలయ ప్రారంభోత్సవానికి హాజరు



ఖమ్మంమయూరిసెంటర్: వైఎస్సార్ టీపీ పాలేరు నియోజకవర్గ కార్యాలయం, పార్టీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల క్యాంపు కార్యాలయ భవనాన్ని వైఎస్.విజయమ్మ ఈనెల 16న ప్రారంభించనున్నారు. ఈ విషయాన్ని క్యాంపు కార్యాలయ ఉద్యోగి నంద్యాల రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం సాయిగణేష్ నగర్‌లోని కార్యాలయాన్ని గురువారం ఉదయం 10.11 గంటలకు విజయమ్మ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. జిల్లా నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

సీసీ రోడ్లు, డ్రెయిన్లకు ఎంపీ ల్యాడ్స్ నిధులు

ఎంపీ నామ నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: ఎంపీ ల్యాడ్స్ నిధుల కేటాయింపులో అన్ని వర్గాలకు సమాన ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు వెల్లడించారు. తాజాగా సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వినతి మేరకు నాలుగు మండలాల్లో ఆరు సీసీ రోడ్లు, రెండు డ్రెయినేజీల నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందులో సత్తుపల్లి మున్సిపాలిటీకి రూ.20 లక్షలు, పెనుబల్లి మండలానికి రూ.10 లక్షలు, తల్లాడ, వేంసూరు మండలాలకు రూ.5లక్షల చొప్పున నిధులు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వాన గ్రామాలు సమగ్రామాభివృద్ధి సాధిస్తుండగా, ఎంపీ ల్యాడ్స్ నిధులనూ కేటాయిస్తున్నట్లు ఎంపీ తెలిపారు.

భక్తులకు ఇబ్బందులు ఎదురుకావొద్దు

ఖమ్మంరూరల్: తీర్థాల జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సంబంధిత శాఖల అధికారులు ఏర్పాట్లపై పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ సూచించారు. మండలంలోని తీర్థాల సంగమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, విద్యుత్ ఏర్పాట్లపై సూచనలు చేశారు. ఈసమావేశంలో తహసీల్దార్ టి.సుమ, ఏసీపీ బస్వారెడ్డి, ఎంపీపీ బెల్లం ఉమ, జెడ్పీటీసీ ఏ.వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐటీ కళాశాల ఇంజనీరింగ్ విద్యార్థినీ, విద్యార్థులు



స్థిరపడదాం.. ఒప్పిద్దాం !

సాక్షి టాక్‌షో

మంచి స్థాయికి చేరాకే పెళ్లి

- ప్రేమిస్తే పెద్దల అంగీకారం తప్పనిసరి
- వాళ్ల ఆశీస్సులుంటేనే ఆనందం
- 'సాక్షి' టాక్ షోలో ఎస్‌బీఐటీ విద్యార్థుల మనోగతం

యువత ఆలోచనల్లో రోజురోజుకు మార్పులొస్తున్నాయి. ఉన్నత విద్య దరి చేరడం.. సామాజిక మాధ్యమాలు అందరికీ అందుబాటులోకి రావడంతో సమాజంలో ఎక్కడ, ఎప్పుడేం జరుగుతుందో తెలుసుకోగలుగుతున్నారు. ఈ నేపథ్యాన జీవితం, భవిష్యత్ లక్ష్యాలు, ప్రేమ, పెళ్లి వంటి అంశాలపై గతంతో పోలిస్తే ఇప్పటి యువతలో స్పష్టత కనిపిస్తోంది. ఈనేపథ్యాన నేడు ప్రేమికుల దినోత్సవం సందర్భంగా సోమవారం ఖమ్మంలోని స్వర్ణభారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఎస్‌బీఐటీ) కళాశాలలో 'సాక్షి' ఆధ్వర్యాన టాక్ షో నిర్వహించగా బీటెక్ విద్యార్థులను తమ మనోభావాలను వెల్లడించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదువుతో పాటు ఉద్యోగ అవకాశాలు మెరుగైన నేపథ్యాన విద్య, ఉద్యోగానికే తమ తొలి ప్రాధాన్యత అని పలువురు చెప్పుకొచ్చారు. ఒకవేళ ప్రేమించినా పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకోవడమే ఉత్తమమనే అభిప్రాయం వ్యక్తమైంది. పిల్లల భవిష్యత్ కోసం తపించే తల్లిదండ్రులను నొప్పించకుండా వారి అంగీకారంతో పెళ్లి చేసుకుంటే జీవనం సాఫీగా సాగుతుందని ఎక్కువ మంది తెలి పారు. ఇక స్నేహితుల మధ్య సైతం ప్రేమాభిమానాలు ఉంటాయని.. ఇలాంటి వాటిని తప్పుగా అర్థం చేసుకుని ఆంక్షలు విధించకపోవడమే మేలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' టాక్ షోలో విద్యార్థులు వెల్లడించిన అభిప్రాయాలు ఇలా ఉన్నాయి. – ఖమ్మం సహకారనగర్

లక్ష్యమే ముఖ్యం

విద్యార్థులు ముందుగా తమ జీవిత లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలి. ప్రతీ విద్యార్థి చదువు మీద దృష్టి సారించాలి. కష్టపడి చదువుకుంటే భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తిస్తే లక్ష్యాన్ని చేరుకున్నాక వారి అంగీకారంతో ఏదైనా చేయొచ్చు.
– ఎస్.విజయ్‌బాబు, సీఎస్‌ఈ, ఫైనల్ ఇయర్

అర్థం చేసుకుని ముందుకెళ్లాలి

జీవితంలో అన్ని అంశాలను అర్థం చేసుకుంటూ ముందుకెళ్లాలి. జీవితంలో భవిష్యత్ ముఖ్యం. ప్రేమించటం నేరం కాదు కానీ ప్రేమ అనేది అంధకారంలో నెట్టేదిగా ఉండొద్దు. కొందరి మధ్య ఉండే సాన్నిహిత్యాన్ని ప్రేమగా భావించటం తప్పు. చదువుకుని ఉన్నత స్థాయికి చేరితే మిగతావన్నీ దరిచేరతాయి.
– పి.నాగమల్లిక, సీఎస్‌ఈ, ఫైనల్ ఇయర్

చదువుపై దృష్టి అవసరం

ప్రతిఒక్కరు చదువుపై దృష్టి సారించాలి. చదువుకోవడం ద్వారానే మనం ఉన్నత స్థానాలకు చేరుకుంటాం. ఆ తర్వాత మన భవిష్యత్‌ను తల్లిదండ్రులే నిర్ణయిస్తారు. శ్రద్ధగా చదువుకుని జీవితంలో స్థిరపడడమే కీలకం. ఆతర్వాత ప్రేమ వివాహమైనా తల్లిదండ్రుల ఇష్టంతో చేసుకుంటే బాగుంటుంది.
– వి.కార్తీక్, సీఎస్‌ఈ, ఫైనల్ ఇయర్

రెండూ ప్రధానమే..

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరు చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకుంటే ఆ తర్వాత అనుకున్నవి చేయడం పెద్ద కష్టమేమీ కాదు. ఈ విషయాన్ని యువత గుర్తించాలి. అన్నింటి కంటే చదువు, కుటుంబం రెండు ముఖ్యమని తెలుసుకుని. ఈ రెండూ బ్యాలెన్స్ చేసుకుంటే మిగతావి ఇబ్బంది కావు.
– సీహెచ్.సంతోష్, సీఎస్‌ఈ, ద్వితీయ సంవత్సరం

ఇబ్బంది కలిగించొద్దు...

అందరి జీవితాల్లో ప్రేమ, పెళ్లి రెండూ ముఖ్యమే. ఈక్రమంలో చదువుకునే సమయంతో పాటు వివాహం విషయంలోనూ సరైన నిర్ణయాలు తీసుకోవాలి. మనం చేసే పని, చెప్పే విషయాలు తల్లిదండ్రులకు ఇబ్బంది కలిగించొద్దు. అప్పుడు వారు సైతం మనకు అన్ని అంశాల్లో అండగా నిలుస్తారు.
– ఎం.నిఘమ, సీఎస్‌ఈ, ద్వితీయ సంవత్సరం

వాళ్లకే బాగా తెలుసు

చదువుకునే సమయాన ఇతర విషయాలపై దృష్టి సారించొద్దు. శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరితే అన్నీ మనకందుతాయి. జీవితంలో స్థిరపడిన తర్వాత మనకేం చేయాలో, ఏమేం ఇవ్వాలో తల్లిదండ్రులకు తెలిసి ఉంటుంది. ఏది మంచో, ఏది చెడో మనకంటే తల్లిదండ్రులకే బాగా తెలుసు.
– శ్వేత మోహనా, సీఎస్‌ఈ ఫైనల్ ఇయర్

వైరాజకీయం !

పొంగులేటి, బీఆర్‌ఎస్ వర్గాల ఎత్తు.. పైఎత్తులు

- 15న ఆత్మీయ భేటీకి పొంగులేటి వర్గం ఏర్పాట్లు
- దీటుగా ఎదుర్కొనేందుకు బీఆర్‌ఎస్ సమాయత్తం



వైరాలో నిర్వహించిన మోటర్ సైకిల్ ర్యాలీలో పొంగులేటి వర్గీయులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో కొన్ని రోజులుగా వైరా కేంద్రంగా రాజకీయాలు ఊపందుకున్నాయి. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వైరా నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించడంతో.. అదే స్థాయిలో బదులిచ్చేందుకు బీఆర్‌ఎస్ జిల్లా నాయకత్వం సిద్ధమవుతోంది. పొంగులేటి కదలికలకు అనుగుణంగా తమ వ్యూహాలను మార్చుకుంటూ పార్టీ నుంచి ఎవరూ బయటకు వెళ్లకుండా చర్యలు చేపట్టింది. ఈనెల 15న వైరాలో పొంగులేటి ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన ఆత్మీయ సమ్మేళనాన్ని గతంలో నిర్వహించిన సమ్మేళనాలకు భిన్నంగా తీసుకుని ఏర్పాట్లు చేస్తుండడం గమనార్హం.

సవాల్.. ప్రతిసవాల్

పొంగులేటి దూకుడును కట్టడి చేసేందుకు బీఆర్‌ఎస్ ఉమ్మడి జిల్లా నాయకత్వం రంగంలోకి దిగింది. వైరా నియోజకవర్గంలో నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారితో పాటు ప్రజాప్రతినిధులైన ఆయన అనుచరగణం 26 మందిని సస్పెండ్ చేశారు. ఈ పరిణామాలతో పొంగులేటి కూడా అశ్వారావుపేట ఆత్మీయ సమ్మేళనంలో దమ్ముంటే తనను సస్పెండ్ చేయాలని పార్టీ అధిష్టానానికి సవాల్ విసిరారు. ఆ వెంటనే బీఆర్‌ఎస్ నేతలు వైరాలో ప్రజాప్రతినిధులతో ఏర్పాటుచేసిన భేటీలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ ' పార్టీలో ఆయనకు ఏ అర్హత లేదు.. దమ్ముంటే ఆయనే రాజీనామా చేయాలి' అని ప్రతిసవాల్ విసిరారు. ఈ పరిణామంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్‌ఎస్ వర్సెస్ పొంగులేటి వర్గం రాజకీయాలు రసవత్తరంగా మారాయి.

వైరా అభ్యర్థి ప్రకటనతో..

కొత్త సంవత్సరం మొదటిరోజున ఖమ్మంలోని క్యాంపు కార్యాలయం వేదికగా బీఆర్‌ఎస్‌పై విమర్శలు మొదలుపెట్టిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. ఆతర్వాత ఆత్మీయ సమ్మేళనాన్ని విమర్శల వేడి పెంచడం ప్రారంభించారు. పినపాక, ఇల్లెందు, మధిర, అశ్వారావుపేట నియోజకవర్గాల ఆత్మీయ సమ్మేళనాల్లో విమర్శలు మరింత పదునెక్కగా... వైరా నియోజకవర్గానికి సంబంధించి ఆయన అభ్యర్థిని ప్రకటించారు. దీంతో మాజీ ఎంపీ అనుచరులు పలువురిపై బీఆర్‌ఎస్ వేటు వేసింది.

దూకుడు పెంచిన పొంగులేటి వర్గం

అనుచరులపై బీఆర్‌ఎస్ సస్పెన్షన్ వేటు వేయడంతో మాజీ ఎంపీ దూకుడు పెంచారు. ఈనెల 15న వైరాలో ఆత్మీయ సమ్మేళనాన్ని భారీ ఎత్తున నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఈక్రమంలో జన సమీకరణ కోసం మండలాల వారీగా సన్నాహక సమావేశాలునిర్వహిస్తూనే సోమవారం వైరాలో పొంగులేటి వర్గీయులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

కట్టడి దిశగా ఎమ్మెల్యే

బీఆర్‌ఎస్‌కు చెందిన ఎవరు కూడా పొంగులేటి వెంట వెళ్లకుండా వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ చర్యలు చేపట్టారు. బుధవారం ఆత్మీయ సమ్మేళనం జరగనున్న నేపథ్యాన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు హాజరుకాకుండా ఎమ్మెల్యే రాములునాయక్‌కు దగ్గరి వ్యక్తిగా చెప్పే ఓ నేత కొందరికి ఫోన్ చేసి మాట్లాడారు. ఈక్రమంలో వారి అంతరంగాన్ని తెలుసుకునేందుకు ఆయన ప్రయత్నించినట్లు తెలుస్తోంది.

ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటుకు అడుగులు

- సీఎం తాజా హామీ మేరకు గ్రీన్ సిగ్నల్
- రఘునాథపాలెంలో స్థల పరిశీలన



ప్రతిపాదిత స్థలం మ్యాప్‌ను పరిశీలిస్తున్న ప్రొఫెసర్లు, అధికారులు

రఘునాథపాలెం: ఇటీవల ఖమ్మంలో కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి వచ్చిన సందర్భంగా జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటుచేయనున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించిన విషయం విదితమే. ఈమేరకు అనుమతి లభించింది. దీంతో రఘునాథపాలెంలోని జింకలతండా రోడ్డు విత్తన గిడ్డంగికి ఎదురుగా సర్వే నంబర్ 30లో 15 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని సోమవారం జేఎన్‌టీయూ, ఓయూకు చెందిన ప్రొఫెసర్లు ఖమ్మం ఆర్డీఓ రవీంద్రనాథ్‌తో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఈ స్థలంపై ప్రొఫెసర్లు సానుకూలత వ్యక్తం చేసినా.. భవిష్యత్‌లో హాస్టళ్లు, ఇతర అవసరాల కోసం కనీసం 50నుంచి 100 ఎకరాల స్థలం ఉంటే మంచిదని కలెక్టర్ గౌతమ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ పరిశీలనలో రఘునాథపాలెం తహసీల్దార్ నర్సింహారావు, ఉద్యోగులు శ్రీనివాస్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా కట్టడికి వ్యూహం

సీపీ విష్ణు ఎస్.వారియర్



గంజాయిని పరిశీలిస్తున్న సీపీ వారియర్

ఖమ్మంక్రైం: ఉమ్మడి జిల్లాకు సరిహద్దుగా ఉన్న ఆంధ్రప్రదేశ్, ఒడిశా ప్రాంతాల నుంచి గంజాయి తరలింపునకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక వ్యూహంతో ముందుకు సాగుతున్నట్లు సీపీ విష్ణు ఎస్.వారియర్ తెలిపారు. ఖమ్మం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం సీపీ మాట్లాడారు. నగర ఏసీపీ గణేష్, టూటౌన్ సీఐ శ్రీధర్ సిబ్బందితో కలిసి టేకులపల్లి బ్రిడ్జి వద్ద ఆదివారం తనిఖీలు చేపట్టగా వైరా నుంచి సూర్యాపేట బైపాస్ రోడ్డులో మహారాష్ట్రకు తరలిస్తున్న రూ.40లక్షల విలువైన 401 కేజీల గంజాయి పట్టుబడిందన్నారు. ఈమేరకు షేక్ ఆసిఫ్, సాజిద్ అహ్మద్‌ఖాన్‌ను విచారిస్తే విశాఖ సరిహద్దు నుంచి మహారాష్ట్రలోని అకోలాకు తరలిస్తున్నట్లు అంగీకరించారని చెప్పారు. అయితే, మహారాష్ట్రకు తరలిస్తున్న గంజాయి కొనుగోలు వ్యవహారంలో బాధ్యులైన రాహుల్, ప్రసాద్, శ్రీనివాసరావు, మహేష్, గణేష్, రమణ, సమీర్, మహేష్ పరారీలో ఉన్నట్లు సీపీ తెలిపారు. ఈమేరకు ఖమ్మం మీదుగా గంజాయి తరలించకుండా ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాట్లు చేస్తున్నట్లు సీపీ వెల్లడించారు. ఈ సమావేశంలో ఏసీపీలు గణేష్, ప్రసన్నకుమార్, సీఐలు శ్రీధర్, చిట్టిబాబు పాల్గొన్నారు.

కలెక్టర్ చిత్రపటానికి పాలాభిషేకం

కుమారుడికి పింఛన్ ఇప్పించడంపై కృతజ్ఞత



కలెక్టర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వీరబాబు దంపతులు, కుమారుడు

కూసుమంచి: దివ్యాంగుడైన కుమారుడికి నిలిచిపోయిన పింఛన్‌ను తిరిగి మంజూరు చేయించడంతో కలెక్టర్ వీ.పీ.గౌతమ్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి ఆ తల్లిదండ్రులు కృతజ్ఞత చాటుకున్నారు. కూసుమంచి మండలం గట్టుసింగారం గ్రామానికి చెందిన లగ్గిశెట్టి వీరబాబు – ఉషారాణి దంపతుల రెండో కుమారుడు గౌతమ్‌కుమార్‌కు చిన్నతనంలోనే కాళ్లు చచ్చుబడిపోయి నడవలేని స్థితికి చేరాడు. ఆయనకు ఆసరా పథకం ద్వారా ఐదు నెల ల క్రితం దివ్యాంగుల పింఛన్ మంజూరైనా గౌతమ్ తండ్రి పేరిట వ్యాన్ ఉందనే కారణంతో జమ చేయలేదు. ఈమేరకు వీరబాబు – ఉషారాణి దంపతులు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్ డే లో కలెక్టర్ గౌతమ్‌ను కలిసి సమస్య వివరించారు. కుమారుడిని ఆస్పత్రులకు తిప్పేందుకే వ్యాన్ కొనుగోలు చేయాల్సి వచ్చిందని వివరించగా.. కలెక్టర్ స్పందించి అక్కడికక్కడే ఐదు నెలల పింఛన్ రూ.15వేలను ఖాతాలో జమ చేయించి ఇక నుంచి ప్రతీ నెల పింఛన్ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. దీంతో గౌతమ్‌తో పాటు ఆయన తల్లిదండ్రులు కృతజ్ఞతగా తమ ఇంట్లో కలెక్టర్ వీ.పీ.గౌతమ్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.

నారాయణ... నారాయణా!

- లీజ్ పూర్తికాకుండానే పాఠశాలలను మూసివేస్తున్న వైనం
- నష్టపోతున్న భవనాలు, పాఠశాలల యజమానులు
- విద్యార్థుల భవిష్యత్‌పై నీలినీడలు
- ఖమ్మంతో పాటు పలు జిల్లాల్లో ఇదే పరిస్థితి

మధిర: పాఠశాల విద్యను బలోపేతం చేసేందుకు రాష్ట్రప్రభుత్వం మన ఊరు – మన బడి తదితర కార్యక్రమాలను అమలుచేస్తుండగా.. పక్క రాష్ట్రంలో స్థాపించి ఇక్కడ కూడా వేళ్లూనుకుపోయిన నారాయణ ఎడ్యుకేషనల్ సొసైటీ యజమాన్యం మాత్రం తల్లిదండ్రులను దోపిడీ చేస్తోంది. వందలాది పాఠశాలలను లీజ్‌కు తీసుకుని.. కొన్నాళ్లకే మూసేస్తుండడంతో అటు పాఠశాలలు, భవనాల యజమానులు, ఇటు విద్యార్థుల భవిష్యత్‌పై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. కొన్ని ప్రైవేట్ పాఠశాలలను నారాయణ కార్పొరేట్ స్కూల్ యాజమాన్యం పదేళ్లు, ఇరవై ఏళ్ల పాటు లీజ్‌కు తీసుకుంటోంది. ఆ వెంటనే పాఠశాలల సొసైటీ పేర్లు మార్చాల్సి ఉన్నా... పాత సొసైటీ పేరుతోనే బస్సులు, ఇతర అనుమతులు కొనసాగిస్తూ పాఠశాలకు మాత్రం నారాయణ విద్యాసంస్థల పేరు పెట్టి రూ.లక్షల్లో ఫీజులు దండుకుంటున్నారు. దీంతో తల్లిదండ్రుల నిరాదరణ ఎదురవుతుండడంతో ఒకటి, రెండేళ్లకు వదిలేస్తున్నారు. ఫలితంగా అప్పటికే భవనాల మరమ్మతులకు రూ.లక్షల్లో వెచ్చించిన పాఠశాలలు, భవనాల యజమానులు నష్టపోవాల్సి వస్తోంది.

నిబంధనలకు విరుద్ధంగా....

ఒక విద్యాసంస్థను నెలకొల్పాలంటే ముందుగా ఒక ఎడ్యుకేషనల్ సొసైటీని స్థాపించి ఆ పరిధిలో అనుమతులు తీసుకోవాలి. అలాగే, ఒక సొసైటీ కింద ఉన్న స్కూల్‌ను ఇంకో సొసైటీకి బదిలీ చేయొద్దు. కానీ నారాయణ ఎడ్యుకేషనల్ సొసైటీ మాత్రం పాఠశాలలనే లీజ్‌కు తీసుకుని నారాయణ టెక్నో స్కూల్, నారాయణ ఒలంపియాడ్ స్కూళ్ల పేరిట నడుపుతుండడం గమనార్హం.

బస్సుల్లోనూ అదే తీరు

హైదరాబాద్ చిరునామాతో రిజిస్ట్రేషన్ చేసి బస్సులను ఆ పరిధిలోనే నడపాలి. కానీ రంగారెడ్డి జిల్లా కూకట్‌పల్లి పరిధిలో నారాయణ ఎడ్యుకేషన్ సొసైటీ పేరిట రిజిస్ట్రేషన్ చేసిన (టీఎస్07 యూబీ 1069, టీఎస్ 07 యూబీ1217) బస్సులను మధిరలో నారాయణ పాఠశాల కింద నడుపుతున్నారు. ఖమ్మంలోనూ ఇదే తరహాలో (టీఎస్ 07యూబీ1082, టీఎస్ 07యూబీ 1208), సత్తుపల్లిలో (టీఎస్07 యూబీ1211, టీఎస్ 07 యూబీ1078, టీఎస్07 యూబీ1081) బస్సులను నడిపిస్తుండడం గమనార్హం. అక్కడి బస్సులు ఇక్కడ తిరగాలంటే కాంట్రాక్టు క్యారేజ్ టాక్స్ కింద సీట్ల సంఖ్య ఆధారంగా ఒక్కో బస్సుకు రూ.1.60లక్షలు చెల్లించాల్సి ఉన్నా కేవలం రూ.7,200 మాత్రమే చెల్లిస్తున్నారని సమాచారం. అలాగే, ఏపీలోకి బస్సులు వెళ్తే ప్రత్యేక అనుమతితో పాటు టాక్స్‌లు చెల్లించాల్సి ఉండగా.. ఏపీ సరిహద్దులో ఉన్న తెలంగాణ జిల్లాల నుంచి అక్కడకు బస్సులు యథేచ్ఛగా తిరుగుతున్నాయి.

ఇప్పటికే మూసివేత

మధిరలో పాఠశాలను మూసివేసేందుకు పాఠశాల భవన యజమాని బోనగిరి వనజకు ఇరవై రోజుల క్రితం నోటీసులు ఇచ్చి తాజాగా తాళాలు వేశారు.

- ఖమ్మం కవిరాజునగర్‌లో త్రివేణి స్కూల్, హాస్టల్ ఉండగా మరో చోటకు మార్చారు. ఇప్పుడు ఈ భవనంలో నారాయణ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యాన నారాయణ ఒలంపియాడ్ స్కూల్ నిర్వహిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో గత ఏడాది ఆగస్టులో ఖమ్మం అర్బన్ ఎంఈఓ శ్రీనివాసరావు తనిఖీ చేసి మూసివేయాలని ఆదేశించగా... మూడురోజుల తాళం వేసి మళ్లీ ప్రారంభించారు. రవాణా శాఖ, అగ్నిమాపక శాఖ, విద్యాశాఖ అధికారులతో పాటు కలెక్టర్‌కు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా విద్యాసంవత్సరాన్ని పూర్తి చేస్తుండడంతో స్టడీ సర్టిఫికెట్లు ఎలా ఇస్తారో తెలియడం లేదు.
- ఖమ్మంలో రాయల వంశీకృష్ణ ఎడ్యుకేషనల్ సొసైటీ కింద జమ్మిబండ, రోటరీనగర్‌లో సెంచరీ స్కూళ్లు ఉన్నాయి. జమ్మిబండలో ఉన్న పాఠశాలను నారాయణ కార్పొరేట్ స్కూల్ వారు లీజ్‌కు తీసుకున్నారు. జీఓ నంబర్ 56/2009 ప్రకారం జీ ప్లస్ టుతో నిర్మించిన ఈ భవనానికి ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్‌కు సడలింపు ఉంది. కానీ నారాయణ స్కూల్ లీజ్‌కు తీసుకున్నా మూడో అంతస్తు నిర్మించారు.

మధ్యలోనే మూసివేస్తున్నారు



గతంలో మాకు ఉన్న లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో 700 మంది విద్యార్థులు ఉండగా, మూడేళ్ల క్రితం నారాయణ ఈ టెక్నో స్కూల్ వారికి భవనంతో సహా లీజ్‌కు ఇచ్చాం. ఇప్పుడు విద్యార్థుల సంఖ్య 230కు పడిపోవడంతో మూసేస్తామని నోటీసు ఇచ్చారు. పదేళ్ల లీజ్ అంటే రూ.లక్షలు వెచ్చించి మరమ్మతు చేయించాం. ఇప్పుడు నష్టాన్ని ఎవరు భరించాలి? – బోనగిరి నారాయణరావు, మధిర

ఇష్టారాజ్యంగా ఫీజుల వసూళ్లు



ఈ టెక్నో స్కూల్ పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. పాఠశాలలో పిల్లలను చేర్పుకునేటప్పుడు ఒక మాట చెప్పి ఆ తర్వాత ఎక్కువ ఫీజులు వసూలు చేస్తున్నారు. పుస్తకాల కోసం రూ.8వేలు తీసుకున్నా అన్ని పుస్తకాలు ఇవ్వలేదు. నాలాగే తల్లిదండ్రులందరూ అవస్థ పడుతున్నారు. పిల్లల భవిష్యత్ కోసం భరిస్తుంటే ఇబ్బంది పెడుతున్నారు. – ఉపేందర్‌రెడ్డి, విద్యార్థి తండ్రి



మధిరలో మూసివేతకు సిద్ధంగా ఉన్న నారాయణ ఈ - టెక్నో స్కూల్ భవనం

ప్రేమే గెలిచింది..

అర్ధాంగికి మారుపేరు...

అశ్వారావుపేట: పెనుబల్లి మండలం కందిమళ్లవారి బంజరకు చెందిన మండవ రామకృష్ణారావు, వేంసూరు మండలం మర్లపాడుకు చెందిన చల్లా నారాయణరెడ్డి రైతులు కావడంతోపాటు కుటుంబాల నడుమ సన్నిహిత సంబంధాలు ఉండేవి. నారాయణరెడ్డి కుమారుడు వెంకటేశ్వరరెడ్డి డీఎంఎల్‌టీ పూర్తి చేసి తండ్రికి సహాయకుడిగా ఉండే రోజుల్లో అనిత ఇంటర్ చదువుతుండగా ఇరువురి మనసులు కలిశాయి. అనిత ఎమ్మెస్సీ(మ్యాథ్స్), బీఈడీ చేశాక ఇరువురి కుటుంబాల ఆమోదంతో 18 మే 2005న వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత ఇద్దరు కుమార్తెలు జన్మించగా, ఇంజనీరింగ్ కాలేజీలో ఫ్యాకల్టీగా చేస్తూనే భర్త ప్రోత్సాహంతో మైనార్టీ ఎడ్యుకేషనల్ సొసైటీలో జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించారు. సత్తుపల్లి కళాశాల ప్రిన్సిపాల్‌గా, ఉమ్మడి జిల్లా ఆర్‌ఎల్‌సీగా బాధ్యతలు నిర్వర్తించి ప్రస్తుతం నేలకొండపల్లి బాలుర మైనార్టీ గురుకులం ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. ఇలా జీవితం సాఫీగా సాగుతుండగా వెంకటేశ్వరరెడ్డి రెండు కిడ్నీలు పూర్తిగా


కుమార్తెలతో అనిత - వెంకటేశ్వరరెడ్డి

చెడిపోయాయి. ఇటు ప్రభుత్వోద్యోగం.. ఇంటర్, తొమ్మిదో తరగతి చదువుతున్న ఇద్దరు కుమార్తెలు.. ప్రేమించి, పెళ్లాడి తనను ఈ స్థానానికి తీసుకొచ్చేందుకు శ్రమించిన భర్తను కాపాడుకునేందుకు అనిత తానే కిడ్నీ ఇచ్చేందుకు నిర్ణయించుకుంది. వారి మనసులు కలిసినట్లే కిడ్నీలు కూడా మ్యాచ్ కావడంతో మార్పిడి చేయగా ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారు. అనితపై వెంకటేశ్వరరెడ్డికి ఉన్న ప్రేమ ఆమె చదువు, ఉద్యోగంలో అండగా నిలిస్తే... వెంకటేశ్వరరెడ్డిపై అనితకు ఉన్న ప్రేమ కిడ్నీ రూపంలో ఆయన శరీరంలో కొనసాగుతోంది.

ప్రేమ, జీవితంలో 'విజేత'లు

ఖమ్మంగాంధీచౌక్: ఉమ్మడి ఖమ్మం జిల్లా మహిళా ప్రాంగణం అధికారి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధి కల్పనాధికారి విజేత ఇంటర్ చదివే సమయంలో సోదరుడి స్నేహితుడు నల్లి వినోద్‌కుమార్‌తో ప్రేమలో పడింది. తన సోదరుడికి కోసం ఇంటికి వచ్చే వినోద్‌తో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారగా... విజేత డిగ్రీ పూర్తిచేశాక 2000 సంవత్సరంలో ఉపాధి కల్పన కార్యాలయంలో ఉద్యోగం సాధించారు. ఈ క్రమంలో ఆమెకు ఇంట్లో పెళ్లి సంబంధాలు చూస్తుండగా వినోద్‌కుమార్‌ను ప్రేమిస్తున్న విషయాన్ని సోదరుడు, తల్లికి చెప్పింది. దీంతో వారు అభ్యంతరం తెలిపారు. ఇదే విషయాన్ని వినోద్‌కుమార్‌కు చెప్పడంతో ఆయన ఎంటెక్ అయ్యాక ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలో లెక్చరర్‌గా చేరాడు. అప్పుడు 2004లో పెద్దలను ఒప్పించి ఇద్దరూ వివాహం చేసుకున్నారు. అనంతరం వినోద్‌కుమార్ స్వీడన్


విజేత - వినోద్‌కుమార్

తదితర దేశాల్లో పనిచేసినా ఇప్పుడు ఖమ్మంలో ప్రైవేట్ పాఠశాల నిర్వహిస్తున్నారు. వీరి కుమారుడు హర్షిత్ రాజ్‌కుమార్ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ సందర్భంగా విజేత – వినోద్ మాట్లాడుతూ ఉన్న దాంట్లోనే ఇతరులకు సాయం చేయాలనే గుణమే తమను కలిపిందని తెలిపారు.

ఫిర్యాదులు పరిష్కరించండి : కలెక్టర్ వీ.పీ.గౌతమ్

ఖమ్మం సహకారనగర్: గ్రీవెన్స్ డే (ప్రజావాణి)లో ప్రజలు ఇచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈసందర్భంగా పలు ఫిర్యాదులపై అధికారులకు సూచనలు చేసి అక్కడికక్కడే పరిష్కరించగా, మిగతా వీటిని త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఆర్థిక అక్షరాస్యతపై ప్రజల్లో అవగాహన కల్పించేలా భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఆధ్వర్యాన రూపొందించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్ గౌతమ్ ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 17 వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్లు స్నేహలత, ఎన్.మధుసూదన్, ఎల్‌డీఎం శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అదనపు కలెక్టర్లు

23 ఏళ్ల ప్రేమబంధం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లికి చెందిన కట్టా శ్రీనివాసరావు, లక్ష్మి పెద్దలను ఒప్పించి 1999లో కులాంతర వివాహం చేసుకున్నారు. డిగ్రీ ఒకే కళాశాలలో చదివేటప్పుడు ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ప్రైవేట్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే శ్రీనివాసరావు పెళ్లి చేసుకున్నారు. ప్రస్తుతం వీరిద్దరు ఇద్దరూ ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూనే సాహిత్య రచనలు చేస్తున్నారు. వీరికి డిగ్రీ చదివే రక్షితసుమ, పదో తరగతి చదివే సుప్రజిత్ రామహర్ష సంతానం. 23 ఏళ్ల ప్రేమబంధంలో అలకలు, కలతలు అప్పుడప్పుడు చోటుచేసుకుంటున్నా అన్నీ సరిదిద్దుకుంటూ లాహిరి.. లాహిరిలో అన్నట్టుగా ప్రేమ నౌకను నడిపిస్తున్నామని శ్రీనివాసరావు, లక్ష్మి ఆనందంగా చెబుతున్నారు. అయితే, ప్రేమపెళ్లికి ఇద్దరు


పిల్లలతో కట్టా శ్రీనివాసరావు, లక్ష్మి

కుటుంబాల వైపు నుంచి అంగీకారం తీసుకుంటే భద్రత ఉంటుందని.. కుటుంబ విషయాలను ఎవరికి వారు కాకుండా సమష్టి నిర్ణయాలు తీసుకుంటే మంచిదని అభిప్రాయం వ్యక్తం చేశారు.

ప్రేమే గెలిపించింది...

ఖమ్మం గాంధీచౌక్: చింతకాని ఎంపీడీఓగా విధులు నిర్వర్తిస్తున్న తేశ్లూరి శ్రీనివాసరావు స్వస్థలం తల్లాడ మండలం తెలగవరం. ఆయన డిగ్రీ చదువుకునే సమయంలో ఖమ్మం రోటరీ నగర్‌లో ఉంటూ ట్యూషన్లు చెప్పేవాడు. అప్పుడు ఇంటర్ చదువుతున్న భూమన నాగమణితో ప్రేమలో పడగా, డిగ్రీ పూర్తయ్యాక 1992 సెప్టెంబర్‌లో వివాహం చేసుకున్నారు. ఈ వివాహానికి నాగమణి తల్లిదండ్రులు రాకపోగా, శ్రీనవాసరావు తల్లిదండ్రులు వచ్చినా ఇంటికి తీసుకెళ్లలేదు. అనంతరం 1994లో శ్రీనివాసరావుకు వరంగల్‌లో బీఈడీ సీటు రావడం, అప్పటికే కుమార్తె జన్మించడంతో వెంగనాయకపాలెంలోని బంధువులు ఇంట్లో భార్య, పాపను ఉంచి వరంగల్ వెళ్లాడు. బీఈడీ అయ్యాక ఇద్దరూ ఖమ్మంలో ప్రైవేట్ స్కూల్‌లో పనిచేస్తుండగా


శ్రీనివాస్‌రావు - నాగమణి

1996లో శ్రీనివాసరావుకు గ్రూప్–4 ద్వారా జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం రాగా.. ఆతర్వాత ఈఓఆర్డీగా పదోన్నతి సాధించాడు. ప్రస్తుతం వీరి కుమార్తె అరుంధతి ఆర్‌డబ్ల్యూఎస్‌లో ఏఈఈగా పనిచేస్తుండగా, కొడుకు బకిన్‌చంద్ర ఎంబీఏ చదువుతున్నాడు.

అన్యోన్య ప్రేమ.. 'విజయ' బంధం

సత్తుపల్లిటౌన్: వ్యవసాయ కళాశాలలో చదువుకునేటప్పుడు ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. కులాంతర వివాహం చేసుకుని వ్యవసాయాధికారులుగా జీవితంలో స్థిరపడి ప్రేమ విజేతలుగా నిలిచారు స్వర్ణ విజయచంద్ర, వాసవీరాణి దంపతులు. కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకులు(ఏడీఏ)గా పని చేస్తున్న విజయచంద్ర, ఇల్లెందు వ్యవసాయ సహాయ సంచాలకులు(ఏడీఏ)గా పనిచేస్తున్న వాసవీరాణికి అగ్రికల్చర్ ఎమ్మెస్సీ చదివేటప్పుడు ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. 1997లో ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే, అటు కుటుంబం, ఇటు ఉద్యోగ బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తిస్తుండగా విజయచంద్ర 2000 సంవత్సరంలో మలేసియాలో అంతర్జాతీయ అవార్డు, జిల్లా స్థాయిలో ఎనిమిది సార్లు ఉత్తమ అధికారిగా అవార్డులు సాధించారు. ఇక వాసవీరాణి జిల్లా స్థాయిలో మూడుసార్లు


స్వర్ణ విజయచంద్ర - వాసవీరాణి

ఉత్తమ అధికారులుగా అవార్డులు అందుకున్నారు. వీరి కుమారులు స్వర్ణ కార్తీక్‌చంద్ర సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా విధులు నిర్వర్తిస్తుండగా, ప్రణీత్ ఐఐటీలో చదువుతున్నారు. తమ అన్యోన్య ప్రేమబంధాన్ని 26 ఏళ్ల నుంచి ఆనందంగా గడిపేస్తున్నామని చెబుతున్న స్వర్ణ విజయ చంద్ర – వాసవీరాణి ఒకరికొకరు అర్థం చేసుకుంటూ నమ్మకంతో ఉంటే సంసార జీవితం సాఫీగా సాగుతుందని తెలిపారు.

తమిళనాడు, ఖమ్మంను కలిపిన ప్రేమ

ఖమ్మం గాంధీచౌక్: ఒకరిపై ఒకరికి ఉన్న ప్రేమే కష్టాలు, కన్నీళ్లు ఎదురైనా విడదీయలేదు. దీంతో వీరి ప్రేమ విజేతగా నిలిచింది. తమిళనాడులోని విల్లుపురం జిల్లా తిండీవనంకు చెందిన మల్లేపల్లి జనార్దన్ ఉపాధి నిమిత్తం 1988లో ఖమ్మంరూరల్ మండలం పల్లెగూడెం వచ్చాడు. అంతకుముందే అక్కడ మేనమామ ఉండటంతో ఆయన వద్దకు వచ్చిన ఆయన నిర్మలను ప్రేమించాడు. వీరి పెళ్లికి పెద్దలు అంగీకరించకపోవడంతో 1990లో వీరిద్దరూ చెన్నై వెళ్లిపోయారు. అక్కడ గది అద్దెకు తీసుకుని ఉండే క్రమంలో సిమెంట్ బస్తాల లోడింగ్, అన్‌లోడింగ్ పనికి కుదిరి రోజుకు రూ.50 ఆదాయం వస్తున్న సమయాన 1991 జనవరి 14న వివాహం చేసుకున్నారు. మూడు నెలలు అక్కడే ఉన్నా పూట గడవడం కష్టం కావడంతో తిరిగి ఖమ్మం వచ్చారు. దీంతో నిర్మల తల్లిదండ్రులు తొలుత నిరాకరించినా ఆతర్వాత ఏప్రిల్‌లో పెద్దలు వీరి వివాహం చేశారు. ప్రస్తుతం జనార్దన్‌లారీ డ్రైవర్‌గా స్థిరపడ్డాడు.


మల్లేపల్లి జనార్దన్, నిర్మల

జనార్దన్– నిర్మల కుమార్తె అలేఖ్య బీఏ, బీఈడీ చదివి ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తుండగా, అల్లుడు న్యాయవాదిగా, కుమారుడు మార్బుల్ షాపులో పనిచేస్తున్నాడు.

ఎల్లన్న నగర్‌లో భూముల సర్వే చేయాలి

పాదయాత్రగా వచ్చి కలెక్టరేట్ ఎదుట ఆందోళన

ఖమ్మంమయూరిసెంటర్: ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటూ.. పోడు కొట్టుకొని జీవనం సాగిస్తున్న తమను ప్రభుత్వం, అధికారులు విస్మరించారని, ఇకనైనా ఎల్లన్ననగర్‌లో పోడు భూముల సర్వే నిర్వహించాలని స్థానికులు కోరారు. ఈమేరకు ఆదివారం సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యాన ఎల్లన్ననగర్ నుంచి పాదయాత్రగా బయలుదేరిన అక్కడి ప్రజలు సోమవారం కలెక్టరేట్ వద్దకు చేరుకొని ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ ఎల్లన్ననగర్‌లో 150మందికి పైగా 400 ఎకరాలపై హక్కుల కోసం దరఖాస్తు చేసుకుంటే సర్వే చేయకపోవడం గర్హనీయమన్నారు. అనంతరం ప్రతినిధులు కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. కాగా, ఎల్లన్ననగర్ నుంచి మహిళలు, వృద్ధులు, పురుషులు చంటిపిల్లలతో పాటు గుబ్బగుర్తి, రాంపురం, తీగల బంజర, మేకలకుంట, లాలాపురం, పల్లిపాడు, కొనిజర్ల, తనికెళ్ల, వెంకటాయపాలెం మీదుగా పాదయాత్ర చేస్తూ కలెక్టరేట్ చేరుకున్నారు. ఆదివారం రాత్రి తనికెళ్లలో వద్ద రోడ్డు పక్కనే బస చేసిన వారు సోమవారం ఉదయం కలెక్టరేట్ ఎదుట ధర్నా తర్వాత లోనకు వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాపంథా నాయకులు గోకినేపల్లి వెంకటేశ్వరరావు, కంకణాల అర్జున్‌రావు, ఆవుల అశోక్, బందెల వెంకయ్య, కె.శ్రీనివాస్, ఎస్.కే.లాల్మియా, పాశం అప్పారావు, డి.శిరీష, సునీత పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నాలో మహిళలు, నాయకులు

రూ.లక్ష రుణమాఫీ అమలుచేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం/ఖమ్మం రూరల్/తల్లాడ/కల్లూరు రూరల్: గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రైతులకు సంబంధించి రూ.లక్ష రుణాలను వెంటనే మాఫీ చేయాలని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ తమిళ నాడు సహ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంతో పాటు జెడ్పీ సెంటర్‌లో జరిగిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌ల్లో ఆయన మాట్లాడారు. తెల్లరేషన్ కార్డు ఉన్న పేదలకు కేంద్రప్రభుత్వం 5కేజీల బియ్యం ఉచితంగా ఇస్తుంటే, సీఎం కేసీఆర్ మాత్రం కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. ఇక తల్లాడ, కల్లూరు మండలం నారాయణపురంలో జరిగిన సమావేశాల్లో కూడా సుధాకర్‌రెడ్డి మాట్లాడారు. ఈసమావేశాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డితో పాటు నాయకులు చింతమల్ల వీరస్వామి, రుద్ర ప్రదీప్, మందా సరస్వతి, చంద్రశేఖర్, రాజేష్‌గుప్త, మూర్తి వీరభద్రప్రసాద్, ఉపేందర్‌గౌడ్, పిల్లలమర్రి వెంకట్, నంబూరి రామలింగేశ్వర్‌రావు, వీరంరాజు, మున్నా మిశ్రా నాయుడు, రాఘవరావు, గాదె కృష్ణారావు, గుమ్మా రామకృష్ణ, నర్సింహారావు, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, ఖమ్మంరూరల్ మండలం చినతండాలో జరిగిన స్ట్రీట్ కార్నర్ సమావేశంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి మాట్లాడారు.

క్లుప్తంగా

పరీక్షా కేంద్రాల్లో పరిశీలన

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు 15నుంచి జరగనున్న నేపథ్యాన కేంద్రాలను డీఐఈఓ కె.రవిబాబు సోమవారం తనిఖీ చేశారు. డీఈసీ సభ్యులు కె.శ్రీనివాసరావు, హెచ్.వెంకటేశ్వరరావు, వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

భాషాపండిట్లు సహకరించాలి

ఖమ్మంసహకారనగర్: పదో తరగతి విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని బోధన కొనసాగించేందుకు భాషా పండిట్లు సహకరించాలని డీఈఓ సోమశేఖరశర్మ సూచించారు. ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ స్పెషలాఫీసర్లు, గ్రేడ్–2 భాషోపాధ్యాయులతో సోమవారం ఆయన జూమ్ మీటింగ్ ద్వారా మాట్లాడారు. డీసీఈబీ సెక్రటరీ నారాయణ, ఏపీఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష జరిమానా

వైరా/తల్లాడ: తల్లాడ మండలం మల్సూర్‌తండాకు చెందిన బానోత్ ఉమాదేవి నాటుసారా అమ్మకం విషయంలో బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించగా రూ.లక్ష జరిమానా విధించారు. ఆమెకు తహసీల్దార్ గంట శ్రీలత సోమవారం రూ.లక్ష జరిమానా విధించారని వైరా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వి.రమ్య తెలిపారు.

కాల్వల వెంట రాత్రంతా గస్తీ

ఖమ్మంఅర్బన్: సాగర్ ఆయకట్టులోని చివరి భూములకు కూడా నీరు అందేలా పర్యవేక్షించేందుకు జలవనరుల శాఖ అధికారులు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. మధిర, ఎర్రుపాలెం, బోనకల్ పరిధిలోని చివరి ఆయకట్టుకు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని రైతుల నుండి ఒత్తిడి వస్తుండడంతో పాలేరు ఈఈ, నోడల్ అధికారి ఎం.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో అధికారులు కాల్వల మొదటి పరిధి తూములకు నీటి వేగం తగ్గించి రాత్రి సమయాన గస్తీ తిరుగుతున్నారు. ఎక్కడ కూడా నీరు పక్కదారి పట్టకుండా, చివరి ఆయకట్టుకు నీరు అందేలా పహారా కాస్తున్నారు.


తూముల వద్ద పర్యవేక్షిస్తున్న అధికారులు

చేయూతనివ్వండి సార్..



నగరంలోని పంపింగ్‌వెల్ రోడ్డులో నివాసం ఉంటున్న సోపాల ధనలక్ష్మి దంపతులకు ఇద్దరు పిల్లలు. వీరిలో 11 ఏళ్ల పాప జనని మెదడులో ఏర్పడిన గడ్డతో పాటు తల వాచింది. దీంతో ధనలక్ష్మిని ఆమె భర్త వదిలేసి వెళ్లగా కుమార్తె, కుమారుడితో భారంగా జీవిస్తోంది. ఈక్రమంలో తాము ఉండేందుకు ఇల్లు కేటాయించాలని బిడ్డతో కలిసి ఆమె కలెక్టరేట్‌కు వచ్చి గ్రీవెన్స్‌లో విన్నవించుకుంది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్


వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి

కొణిజర్ల: కొణిజర్ల మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుల సంఖ్య రెండుకు చేరింది. సైకిల్, బైక్ ఢీకొన్న ఘటనలో సైకిల్‌పై వెళ్తున్న కొణిజర్లకు చెందిన పొట్లబత్తిని శ్రీను ఆదివారం రాత్రి మృతి చెందిన విషయం తెలిసిందే. ఇక, వైరా మండలం ముసలిమడుగుకు చెందిన తడికమళ్ల వంశీ(21) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. వంశీ సోదరుడైన తడికమళ్ల సాయితో కలిసి కల్లూరులో ఓ వేడుకకు హాజరై తిరిగి వాహనాన్ని ఖమ్మంలో ఉన్న తమ బంధువుకు అప్పగించేందుకు వెళ్తూ.. కొణిజర్ల మండల పరిషత్ కార్యాలయం సమీపంలో సైకిల్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడ ఎస్సై శంకర్‌రావు తెలిపారు. వంశీ ప్రస్తుతం డిగ్రీ చివరి సంవత్సరం చదువుతుండగా, ఒక్కగానొక్క కొడుకు మృతితో తండ్రి నాగార్జున రోదిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది.


తడికమళ్ల సాయి (ఫైల్)

బనిగండ్లపాడు ప్రమాదంలో ఒకరు...

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు –బుచ్చిరెడ్డిపాలెం మధ్య శ్రీఆంజనేయస్వామివారి గుట్ట సమీపాన రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్ర గాయాలపాలయ్యారు. బుచ్చిరెడ్డిపాలెంకు చెందిన శీలం శ్రీనివాసరెడ్డి(35) తన తండ్రి సాంబశివారెడ్డిని(65) బైక్‌పై ఎక్కించుకుని బనిగండ్లపాడు నుండి స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో ములుగుమాడుకు చెందిన రేలచర్ల వెంకటేశ్వరరావు బనిగండ్లపాడు వైపు ద్విచక్ర వాహనంపై వేగంగా వస్తూ శ్రీనివాసరెడ్డి వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో సాంబశివారెడ్డి, శ్రీనివాసరెడ్డికి తీవ్ర గాయాలు కాగా మధిర ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం తరలిస్తుండగా సాంబశివారెడ్డి(65)మృతి చెందాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సురేష్ తెలిపారు.


సాంబశివారెడ్డి (ఫైల్)

చికిత్స పొందుతున్న వ్యక్తి..

కారేపల్లి: రోడ్డుప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కారేపల్లి మండలం గుట్టకిందిగుంపు గ్రామానికి చెందిన చేల వెంకటేశ్వర్లు(48) ఈనెల 9న సుదిమళ్లకు మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా సింగరేణి ఓసీ ప్రాంతంలో ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వర్లుకు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స చేయిస్తుండగా సోమవారం మృతిచెందాడు. ఘటనపై మృతుడి కుమారుడు వినోద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.రామారావు తెలిపారు.

వేసవి మంటలు..!

▶ మొదటి పేజీ తరువాయి

చెబుతోంది. అయితే ఎల్ నినో సీజన్ మొదలయ్యేందుకు ఇంకా మూడు నాలుగు నెలలు ఉన్నందున ఈ అంచనాలు తప్పు కావచ్చునని కూడా పేర్కొంది. కాగా ఈ నెలాఖరుకు తాజా అంచనాలను విడుదల చేస్తామని ఐఎండీ డైరెక్టర్ ఎం.మహాపాత్ర తెలిపారు. ఇలా ఉండగా వాతావరణంలో అనూహ్య మార్పుల వల్ల అతి భారీ, అకాల వర్షాలు, అసాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, ఈ వేసవిలో వడగాడ్పుల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని ఐఎండీ రిటైర్డ్ అధికారి రాళ్లపల్లి మురళీకృష్ణ చెప్పారు.

సమాచారం ఆందోళనకరమే: స్కైమెట్

ఈ ఏడాది ఎల్ నినో, లా నినా పరిస్థితులపై అందిన ప్రాథమిక సమాచారం ఆందోళనకరంగానే ఉందని దేశంలోనే తొలి ప్రైవేట్ వాతావరణ అంచనాల సంస్థ స్కైమెట్‌కు చెందిన మహేశ్ పలవట్ చెబుతున్నారు. 'పరిస్థితులు లా నినా నుంచి ఎల్ నినో వైపునకు మారుతున్నాయంటేనే ప్రమాదం ముంచుకొస్తోందని అర్థం. రుతుపవనాల సమయంలో ఎల్ నినో ఏర్పడితే ఈ ఏడాది వర్షాలు తగ్గుతాయి. ఆసక్తికరమైన అంశం ఏమిటంటే.. 2020లోనే లా నినా పరిస్థితులు ఏర్పడి, ప్రస్తుతం కూడా అదే కొనసాగుతున్నా ఉష్ణోగ్రతలు అసాధారణ స్థాయిలో ఉండటం, గత ఏడాది కొన్నిసార్లు విపరీతమైన వడగాడ్పులు నమోదు కావడం. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చిల్లోనూ ఉష్ణోగ్రతలు కొంచెం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఆ తర్వాత మాత్రం అసాధారణ స్థాయిలో ఉండవచ్చు..' అని పలవట్ పేర్కొన్నారు.

సముద్ర జలాలు వెచ్చబడితే అధిక ఉష్ణోగ్రతలు

లా నినా పరిస్థితుల్లో తూర్పు నుంచి పశ్చిమం వైపు వీచే వాణిజ్య పవనాలు బలంగా ఉంటాయి. దీనివల్ల సముద్ర ఉపరితలంపై ఉండే వెచ్చటి నీరు పశ్చిమ దిక్కుకు ఎక్కువగా కదులుతుంది. అదే సమయంలో సముద్రపు లోపలి భాగంలోని శీతల జల ప్రవాహాలు తూర్పువైపునకు ప్రయాణిస్తాయి. అధిక వర్షాలకు కారణమవుతాయి. ఎల్ నినోలో పరిణామాలు మాత్రం దీనికి వ్యతిరేక దిశలో ఉంటాయి. వాణిజ్య పవనాలు బలహీనపడి ఉపరితలంపైన వెచ్చటి నీరు తూర్పు దిక్కుకు అంటే మన వైపు ప్రయాణిస్తుంది. అప్పటికే చల్లగా ఉన్న నీటిని ఇవి వెచ్చబెడతాయి. ఫలితంగా ఉష్ణోగ్రతలు పెరిగిపోతాయి. ఇండోనేసియా, ఆస్ట్రేలియాల్లోనూ అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. గాల్లో తేమ శాతం తగ్గిపోతుంది. ఫలితంగా రుతుపవనాలు బలహీనపడిపోతాయి. కరువులు, కార్చిచ్చులు ఎక్కువవుతాయి.

సగటు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం

ఉష్ణోగ్రతలు నమోదు చేయడం మొదలుపెట్టిన తరువాత అత్యధిక వేడి నమోదైన సంవత్సరాల్లో 2022ది ఐదో స్థానం. ఈ ఏడాది ఎల్ నినో పరిస్థితులు ఏర్పడితే ఈ రికార్డులు చెరిగిపోయే అవకాశం ఉంది. సగటు ఉష్ణోగ్రతలు శతాబ్దం క్రితంతో పోలిస్తే 1.5 డిగ్రీ సెల్సియస్ వరకు పెరగవచ్చునని అంచనా. గత ఏడాది భారత్‌లో కనీసం తొమ్మిది నగరాల్లో వేసవి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీ సెల్సియస్ కంటే ఎక్కువగా నమోదైన విషయం ఇక్కడ చెప్పుకోవాలి. ఉత్తర, వాయవ్య, తూర్పు ప్రాంతాల్లో తీవ్రమైన వడగాడ్పులు రావచ్చని గత ఏడాది ఐఎండీ హెచ్చరించింది.

ఏర్పాట్లు చేసుకోమన్నాం..

మధ్యమ స్థాయి ఎల్‌నినో రుతుపవనాలపై ప్రభావం చూపగలదు. దీనివల్ల కురిసే వర్షాల మోతాదు తగ్గుతుంది. కానీ ఇప్పటి వరకు అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా మాత్రం రుతుపవనాలు సాధారణం కంటే తక్కువ స్థాయిలో ఉంటాయని చెప్పలేం. రానున్న మూడు నాలుగు నెలల్లో బంగాళాఖాతం, అరేబియా సముద్రాల ఉపరితల జలాల ఉష్ణోగ్రతల్లో తేడాల ఆధారంగా రుతుపవనాల తీవ్రతలో తేడాలు రావచ్చు. మొత్తం మీద ఈ సారి ఎండలు తీవ్రంగానే ఉండబోతున్నాయి. ఇందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని కూడా సూచించాం.

–ఎం.రాజీవన్, ఎర్త్ సైన్స్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి

ప్రజాస్వామ్య స్ఫూర్తితో గవర్నర్ సేవలు

- విశ్వభూషణ్ హరిచందన్‌ను కొనియాడిన ఏపీ ముఖ్యమంత్రి జగన్
- గవర్నర్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయిన సీఎం దంపతులు


గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ దంపతులకు జ్ఞాపికను అందిస్తున్న సీఎం వైఎస్ జగన్, సతీమణి భారతి

సాక్షి, అమరావతి: అధికార కార్యకలాపాల నిర్వహణలో ప్రజాస్వామ్య స్ఫూర్తితో వ్యవహరించి గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ఎంతో రాజకీయ పరిణతి కనబరిచారని ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనియాడారు. ఆయన గవర్నర్‌గా రాష్ట్రానికి అందించిన సేవలను ప్రజలు సదా గుర్తుంచుకుంటారన్నారు. ఛత్తీస్‌గఢ్ గవర్నర్‌గా బదిలీ అయిన విశ్వభూషణ్ హరిచందన్‌తో సీఎం వైఎస్ జగన్ రాజ్‌భవన్‌లో సోమవారం భేటీ అయ్యారు. రాజ్‌భవన్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ భారతి దంపతులకు గవర్నర్ సంయుక్త కార్యదర్శి సూర్యప్రకాశ్, ఉప కార్యదర్శి నారాయణస్వామి స్వాగతం పలికారు. అనంతరం వారిరువురూ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, సుప్రవ హరిచందన్ దంపతులతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్‌తో సీఎం మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం సాధించి సత్సంబంధాలు సాగేలా కీలక పాత్ర పోషించారన్నారు. కరోనా విపత్కర పరిస్థితులను అధిగమించి రాష్ట్రం ప్రగతిపథంలో పయనించడానికి గవర్నర్ ఎంతో సహకరించారన్నారు. విశ్వభూషణ్ హరిచందన్ బదిలీ కావడం బాధాకరమైనా మరో రాష్ట్రానికి గవర్నర్‌గా వెళ్లడం ద్వారా అక్కడి ప్రజలకు మేలు చేయగలుగుతారన్నారు.

అటవీ పరిహారం పెంపు

- వన్యప్రాణుల దాడుల్లో మరణాలు, పంట నష్టాలకు పరిహారం పెంచాలని వైల్డ్ లైఫ్ బోర్డు ప్రతిపాదనలు
- అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వన్యప్రాణుల దాడుల్లో (పులులతో సహా) మరణాలు, పంట నష్టాలకు పరిహారం పెంచాలని రాష్ట్ర వైల్డ్ లైఫ్ బోర్డు నిర్ణయించింది. ప్రస్తుతం రూ.ఐదు లక్షలు ఉన్న పరిహారాన్ని పది లక్షలకు పెంచుతూ ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపనున్నారు. సాధారణ గాయాలైతే వాస్తవ వైద్యం ఖర్చు (లక్షకు మించకుండా), తీవ్రంగా గాయపడితే వైద్యానికి అయ్యే ఖర్చు (మూడు లక్షలకు మించకుండా), అంగవైకల్యం ఏర్పడితే లక్ష పరిహారం, పెంపుడు జంతువులు చనిపోతే వాస్తవ అంచనా, పంట నష్టానికి ప్రస్తుతం ఎకరాకు ఆరువేలు ఉన్న పరిహారాన్ని రూ.7,500కు పెంచాలని, పండ్ల తోటలకు నష్టపరిహారం కూడా రూ.7,500కు (గరిష్టంగా యాభై వేల దాకా) పెంచాలని కమిటీ ప్రతిపాదించింది. సోమవారం అరణ్య భవన్‌లో అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర వన్యప్రాణి మండలి (వైల్డ్ లైఫ్ బోర్డు), మనుషులు – జంతువుల మధ్య ఘర్షణ వాతావరణం తగ్గించే చర్యల సూచనల కమిటీ సమావేశాలు జరిగాయి.

- అటవీశాఖ నేతృత్వంలో అడవుల రక్షణ, వన్యప్రాణి సంరక్షణ కోసం తీసుకుంటున్న చర్యలను పీసీసీఎఫ్ ఆర్.ఎం.డోబ్రియాల్ వివరించారు. రాష్ట్రంలో మొదటి సారి చేపట్టిన పులుల ఆవాసాల్లో ఉన్న మానవ ఆవాసాల తరలింపు (కవ్వాల్ లో రెండు గ్రామాలు) ప్రక్రియ సజావుగా కొనసాగుతోందని తెలిపారు.

వైల్డ్ లైఫ్ బోర్డు సమావేశంలో కీలక నిర్ణయాలు

- హైదరాబాద్ వనస్థలిపురంలో బస్ టెర్మినల్ నిర్మాణానికి వన్యప్రాణి మండలి ఆమోదం తెలిపింది.
- హరిణి వనస్థలికి చెందిన 1.354 హెక్టార్ల అటవీ భూమి నిబంధనలకు అనుగుణంగా మళ్లింపును అనుమతిని ఇచ్చారు. జాతీయ రహదారిలో విపరీతంగా పెరిగిన రద్దీ, ప్రయాణీకుల సౌకర్యం కోసం ఈ టెర్మినల్ నిర్మాణం కానుంది.
- శ్రీశైలం రహదారి విస్తరణ కోసం వచ్చిన ప్రతిపాదనను అమ్రాబాద్ లో ఉన్న వన్యప్రాణి సంరక్షణ దృష్టిలో పెట్టుకుని బోర్డు తిరస్కరించింది. ఇతర రోడ్లు, ఇరిగేషన్, (కడెం పరిధిలో లక్ష్మీపూర్ లిఫ్ట్, నాగార్జున సాగర్ పరిధిలో పెద్దగుట్ట లిఫ్ట్) కేబుల్ పనులకు బోర్డు ఆమోదం తెలిపింది. వన్యప్రాణులు ప్రమాదంలో పడ్డప్పుడు కాపాడేందుకు అవసరమైన రెస్క్యూ టీమ్‌ల సంఖ్యను పెంచాలని నిర్ణయించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, వనమా వెంకటేశ్వరరావు, సభ్యులు కోవ లక్ష్మి, రాఘవ, బానోతు రవి కుమార్, అనిల్ కుమార్, పీసీసీఎఫ్ (ఎఫ్ఏసీ) ఎం.సీ.పర్గెయిన్, అటవీశాఖ అడిషనల్ సెక్రటరీ ప్రశాంతి, ఓఎస్డీ శంకరన్ పాల్గొన్నారు.

నికర అప్పు 2,83,452 కోట్లు

▶ మొదటి పేజీ తరువాయి

జాతీయ బ్యాంకులు, నాబార్డు లాంటి ఆర్థిక సంస్థలు ఇచ్చిన రుణాలను సంవత్సరాలవారీగా వెల్లడించాలని కోరుతూ నల్లగొండ కాంగ్రెస్ ఎంపీ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లోక్‌సభలో లిఖితపూర్వకంగా వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సమాచారం మేరకు ఈ అప్పుల లెక్కలను వివరించారు. ప్రభుత్వరంగ బ్యాంకుల నుంచి తెలంగాణ ప్రభుత్వం ఇప్పటివరకు రుణాలేవీ తీసుకోలేదని పేర్కొన్నారు. 2014 జూన్ 2 నుంచి 2021–22 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ఎఫ్ఆర్‌బీఎం చట్టానికి లోబడి రూ.2.84 లక్షల కోట్ల నికర అప్పు తెలంగాణ ప్రభుత్వానికి ఉందన్నారు. నికర అప్పుతోపాటు నాబార్డు, వివిధ బ్యాంకుల నుంచి పలు కార్పొరేషన్లు తీసుకున్న రుణాలను కూడా ఈ సమాధానంలో కేంద్రం సవివరంగా పేర్కొంది. ఈ వివరాల ప్రకారం రాష్ట్ర అప్పులు 2016–17లో రూ. లక్ష కోట్ల మార్కు దాటితే 2019–20లో రూ. 2 లక్షల కోట్ల మార్కు దాటాయని వెల్లడించింది.

12 బ్యాంకుల నుంచి కార్పొరేషన్ల రుణాలు

రాష్ట్రం ఏర్పాటయ్యాక 12 జాతీయ బ్యాంకుల నుంచి కార్పొరేషన్లకు రుణాలు లభించినట్లు కేంద్రం లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించింది. ఈ బ్యాంకులన్నింటి ద్వారా 2014 జూన్ నుంచి 2022 అక్టోబర్ వరకు మొత్తం రూ. 1.28 లక్షల కోట్లను ప్రభుత్వం పూచీకత్తు ఉండి కార్పొరేషన్లకు ఇప్పించిందని తెలిపింది.

భగీరథకు 'నిడా' రుణాలు

నాబార్డు ద్వారా వివిధ నిధుల కింద కూడా తెలంగాణ ప్రభుత్వరంగ కార్పొరేషన్లు రుణాలు తీసుకున్నాయని కేంద్రం వెల్లడించింది. ఇందులో గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి నిధి (ఆర్ఐడీఎఫ్) కింద రూ. 7,144 కోట్లు, వేర్‌హౌస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (డబ్ల్యూఐఎఫ్) కింద రూ. 85,227.94 కోట్లు, ఫుడ్ ప్రాసెసింగ్ ఫండ్ (ఎఫ్‌పీఎఫ్) కింద రూ. 1,007.10 కోట్ల మేర రుణాలు తీసుకున్నట్లు తెలిపింది. నాబార్డు మౌలిక వసతుల అభివృద్ధి సాయం (నిడా) కింద రూ. 11,424 కోట్లను అప్పుగా తీసుకున్నట్లు వివరించింది. ఇందులో మిషన్ భగీరథ ప్రాజెక్టుకు తెలంగాణ తాగునీటి సరఫరా కార్పొరేషన్ లిమిటెడ్ (టీడీడబ్ల్యూఎస్‌సీఎల్) ద్వారా ఉమ్మడి మెదక్, రంగారెడ్డి, నిజామాబాద్, ఖమ్మం, నల్లగొండ, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లోని సెగ్మెంట్లలో భగీరథ పనులు చేసేందుకు రుణాలు తీసుకున్నారని తెలిపింది. కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ (కేఐపీసీ) ద్వారా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, కొమురెల్లి మల్లన్న రిజర్వాయర్, నృసింహసాగర్ (బస్వాపూర్) రిజర్వాయర్ల నిర్మాణం కోసం ఈ రుణాలు సేకరించినట్లు పంకజ్ చౌదరి లిఖితపూర్వక సమాధానంలో స్పష్టం చేశారు.

తెలంగాణ ఏర్పాటైన తర్వాత తీసుకున్న రుణాలు (సంవత్సరాల వారీగా)

సంవత్సరం	నికర అప్పు	ఆ ఏడాది పెరిగిన అప్పులు (రూ. కోట్లలో)
2014 జూన్ 2 నాటికి	75,577	-
2014-15	83,698	8,121
2015-16	99,213	15,515
2016-17	1,29,532	30,319
2017-18	1,52,190	22,658
2018-19	1,75,281	23,091
2019-20	2,05,858	30,577
2020-21	2,44,019	38,161
2021-22	2,83,452	39,433


నాబార్డు ద్వారా మంజూరైన, తీసుకున్న అప్పులు (2022 అక్టోబర్ నాటికి)

నిధి	మంజూరైన రుణం	వచ్చిన రుణం (రూ. కోట్లలో)
ఆర్ఐడీఎఫ్	8,873	7,144
డబ్ల్యూఐఎఫ్	97,278.89	85,227.94
ఎఫ్‌పీఎఫ్	2,883.00	1,007.10
నిడా	14,516.65	11,424.66

(నోట్: ఈ రుణాలు వివిధ కార్పొరేషన్లకు రాష్ట్ర ప్రభుత్వం పూచీకత్తు ఉండి ఇప్పించినవి. ఇవి కాక వివిధ ప్రభుత్వరంగ బ్యాంకుల ద్వారా రూ. 1.28 లక్షల కోట్లకుపైగా రుణాలను ప్రభుత్వం పూచీకత్తు ఉండి ఇప్పించిందని కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించింది. ఇలా కార్పొరేషన్లు తీసుకున్న రుణాలు కేంద్ర లెక్కల ప్రకారం రూ. 2.42 లక్షల కోట్ల వరకు ఉన్నాయి)

హైకోర్టులో 'కార్వీ'కి ఊరట

ఈడీ అప్పీల్ కొట్టివేత



సాక్షి, హైదరాబాద్: కార్వీ గ్రూప్‌కు హైకోర్టులో ఊరట లభించింది. ఈడీ ఎడ్జుడికేటింగ్ అథారిటీ జారీ చేసిన షోకాజ్ నోటీసులపై సమాధానం ఇవ్వడానికి కార్వీకి హైకోర్టు సింగిల్ జడ్జి రెండు నెలల సమయం ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ ఈడీ సీజే ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేసింది. వాదనలు విన్న ధర్మాసనం అప్పీల్‌ను కొట్టివేసింది. ఖాతాదారులకు చెందిన షేర్లను తాకట్టు పెట్టి రుణం పొంది వాటిని డొల్ల కంపెనీలకు మళ్లించారన్న ఆరోపణలపై కార్వీపై మనీలాండరింగ్ కేసు నమోదు చేసిన ఈడీ... షేర్లు, భూములు, భవనాలు, విదేశీ కరెన్సీ, బంగారు ఆభరణాలను జప్తు చేయడం తెలిసిందే. దీన్ని సవాల్ చేస్తూ సంస్థ సీఎండీ పార్థసారథి సహా మరికొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సింగిల్ జడ్జి... ఈడీ ఎడ్జుడికేటింగ్ అథారిటీ ఆస్తుల జప్తు నోటీసులపై సమాధానం ఇవ్వడానికి కార్వీకి 2 నెలల సమయం ఇచ్చారు. ఈ తీర్పును తప్పుబడుతూ ఈడీ అప్పీల్ దాఖలు చేసింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఈడీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ అథారిటీ 180 రోజుల్లో రిపోర్టు అందజేయాల్సి ఉంటుందని, అదనంగా సమయం ఇవ్వడం సరికాదన్నారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. సమయ వెసులుబాటు ఇచ్చే అధికారం కోర్టులకు ఉంటుందని స్పష్టం చేసింది. సింగిల్ జడ్జి ఇచ్చిన రెండు నెలల గడువు మరో వారంలో ముగియనుండగా ఇప్పుడు సవాల్ చేయడాన్ని తప్పుబడుతూ అప్పీల్‌ను కొట్టివేసింది.

జిల్లా వార్తలు

పాదయాత్రగా రామయ్య చెంతకు..


పాదయాత్రగా వచ్చిన ఏపీకి చెందిన భక్తులు

భద్రాచలం: ఏపీకి చెందిన భక్తులు పాదయాత్రగా భద్రాచలం చేరుకుని సోమవారం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకున్నారు. కాకినాడకు సమీపంలోని అచ్చిపేట తదితర గ్రామాలకు చెందిన సుమారు 300మంది భక్తులు 2012 నుంచి ఏటా పాదయాత్రగా భద్రాచలం రావడం ఆనవాయితీ. దీంతో ఈసారి కూడా 300 కి.మీ. పాదయాత్రగా వచ్చిన వారు ఆలయ ప్రదక్షిణ అనంతరం స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా బృందం చెందిన గురువు వాసుదేవ మాట్లాడుతూ ఈనెల 4న పాదయాత్ర ప్రారంభించి ప్రత్యేకంగా తయారు చేసిన రథం, శ్రీరామనామస్మరణతో భద్రాద్రి చేరుకున్నట్లు తెలిపారు.

సంక్షేమ పథకాలు గిరిజనుల చెంతకు చేరాలి


దర్బార్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్

భద్రాచలం: ఐటీడీఏ ద్వారా ప్రభుత్వం అమలుచేస్తున్న స్వయం ఉపాధి, సంక్షేమ పథకాలు ప్రతీ గిరిజనుడి చెంతకు చేరేలా అధికారులు కృషి చేయాలని భద్రాచలం ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి(జనరల్) డేవిడ్‌రాజ్ సూచించారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటుచేసిన గిరిజన దర్బార్‌లో ఆయన వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించి అధికారులతో సమీక్షించారు. గిరిజన గురుకుల పాఠశాలలో సీట్ల కోసం దరఖాస్తు చేయాల్సి అవసరం లేదని, పోడు భూములకు పట్టాల జారీపై కసరత్తు జరుగుతున్నందున దర్బార్‌లో దరఖాస్తులు ఇవ్వొద్దని గిరిజనులకు సూచించారు. కాగా, గిరిజనుల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ఐటీడీఏ ఆధ్వర్యాన అమలుచేస్తున్న పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు సురేష్‌బాబు, భాస్కరన్, మునీర్‌పాషా, ప్రభాకర్‌రావు, ఆదినారాయణ, హరికృష్ణ, దుర్గయ్య, ప్రమీలబాయ్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ కథ.. కావొద్దు విషాదగాథ

- లోబర్చుకుని ఆపై ముఖం చాటేస్తున్న పలువురు
- ఆకర్షణ పేరుతో మోసపోతున్న యువతులు
- సోషల్ మీడియా వ్యాప్తితో పెరిగిన దారుణాలు



ఖమ్మంక్రైం:

- ఖమ్మం రోటరీనగర్‌లో బీటెక్ పూర్తిచేసిన యువతితో ఫేస్‌బుక్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నట్లు చెప్పుకున్న ఓ యువకుడు పరిచయమయ్యాడు. ఆ తర్వాత మాటలు కలపడంతో పరిచయం కాస్తా ప్రేమకు దారితీసింది. దీంతో యువతి కుటుంబీకులకు చెప్పకుండా ఇంట్లోని నగలు, రూ.లక్షల్లో నగదు తీసుకుని ఆ యువకుడికి వద్దకు వెళ్లగా ఆయన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కాదని, జులాయి అని తేలింది. అప్పటికే తన వద్ద ఉన్న డబ్బులు, నగలు కోల్పోగా ఎలాగోలా బయటపడింది. ఆతర్వాత తల్లిదండ్రులు, బంధువుల ఛీత్కారాలు ఎదుర్కోలేక నానా ఇక్కట్లు పడింది.
- ఖమ్మం రూరల్ మండలానికి చెంది ఇంజనీరింగ్ చదివే యువతిని ఆటోడ్రైవర్‌గా పనిచేసే యువకుడు తన మాయమాటలతో ప్రేమలోకి దింపాడు. ఆమె కుటుంబసభ్యులు వీరి ప్రేమను వ్యతిరేకించడంతో వేరే ప్రాంతానికి వెళ్లి మరీ ప్రేమ వివాహం చేసుకున్నారు. తర్వాత ఆ యువకుడి అసలురూపం బయటపడింది. వరకట్నం తీసుకురావాలని యువతిని వేధిస్తుండటంతో ఎవరికి చెప్పుకోలేక, తల్లిదండ్రుల వద్దకు రాలేక ఆత్మహత్యకు పాల్పడింది.

జిల్లాలో ఇటీవల వెలుగుచూసిన ఈ ఘటనలు కేవలం ఉదాహరణలు మాత్రమే. ఇలాంటి ఎన్నో ఘటనలు జిల్లాలో చోటు చేసుకుంటున్నాయి. చాలా మంది యువతులకు కొందరు జులాయిగా తిరిగే యువకులు పరిచయమవుతున్నారు. ఆకర్షించేలా రూపం, ఆకట్టుకునే దుస్తులతో ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ తమను తాము ఉద్యోగులుగా చెప్పుకుంటూ పరిచయం పెంచుకుని ప్రేమ ముగ్గులోకి దింపుతున్నారు. సెల్‌ఫోన్ నంబర్లు సేకరించి సామాజిక మాధ్యమాల ద్వారా దగ్గరై తమ వాంఛలు తీర్చుకుని ముఖం చాటేస్తున్నారు. దీంతో మోసపోయామని తెలుసుకున్నాక యువతులు ఆత్మహత్యకు పాల్పడడమో లేదంటే కుంగిపోయి ఆస్పత్రుల్లో చేరడమో జరుగుతోంది. ఇక అందరి చేతుల్లో ఇంటర్నెట్ సౌకర్యంతో కూడిన సెల్‌ఫోన్లు రావడంతో ప్రేమ పేరిట మోసాలు నానాటికీ ఎక్కువవుతున్నాయి.

కనబడుట లేదు...

గతేడాది జనవరి నుంచి ఈ ఏడాది జనవరి వరకు జిల్లాలో 328 మంది కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదులు అందాయి. వీరిలో 80శాతం మందికిపైగా యువతులు ఉండగా.. ఇందులో కొందరు తిరిగొచ్చారు. మిగతా వారు ఇళ్ల నుంచి వెళ్లిపోవడానికి ప్రేమ వ్యవహారమే కారణమని పోలీసు రికార్డుల ద్వారా తెలుస్తోంది.

తల్లిదండ్రులకు మనో వ్యథ

యువతులు ప్రేమ పేరుతో మోసపోతుంటే వారి తల్లిదండ్రులకు మనోవ్యథ మిగులుతోంది. తమ కూతురు వేరే యువకుడితో వెళ్లిపోయి వివాహం చేసుకుంటే బంధువులు, సమాజం నుంచి ఎదురయ్యే ఛీత్కారాలతో కొందరు తల్లిదండ్రులు ఊరు విడిచి వెళ్లిపోతున్నారు. తమ బిడ్డ ఎక్కడో ఒక దగ్గర సుఖంగా ఉంటుందనే ధీమాతో కాలం వెళ్లదీస్తుండే క్రమంలో కొందరు మోసపోతుండడంతో గుండె పగిలిపోయేలా రోదిస్తున్నారు. మరోపక్క ప్రేమ పేరుతో మోసపోయిన యువతులు తమ కుటుంబీకులకు భారం కాలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. కొందరిని తల్లిదండ్రులు చేరదీసి కౌన్సెలింగ్ ద్వారా సాధారణ స్థాయికి తీసుకొస్తుండగా.. ఎక్కువ మంది మాత్రం తమను తాము మోసం చేసుకోలేక కుటుంబాలకు దూరమవుతున్నారు.

అమ్మనాన్నతోనే అందమైన భవిష్యత్



అమ్మనాన్నల సహకారంతోనే అందమైన జీవితం సొంతమవుతుందనే అవగాహన యువతలో పెరగాలి. ఓపక్క అందరి దరి చేరిన సోషల్ మీడియాకు తోడు, తల్లిదండ్రులు బిజీ లైఫ్‌తో పిల్లలను పట్టించుకోవడం లేదు. దీంతో యువతులు ఆకర్షణను ప్రేమగా భావించి చాలాచోట్ల మోసపోతున్నారు. ఆ తర్వాత ఎవరికీ చెప్పుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఇలాంటి వారిని గుర్తించి తల్లిదండ్రులు భుజం తట్టడంతో పాటు అవసరమైతే కౌన్సెలింగ్ చేయించాలి.

– కువ్వారపు శ్రీనివాస్, సీనియర్ కౌన్సిలర్, చైల్డ్‌లైన్ ఖమ్మం జిల్లా కన్వీనర్

'డబుల్' ఇళ్ల నిర్మాణంలో అలసత్వం


శిలాఫలకం వద్ద బీఎస్పీ నాయకులు

మహబూబాబాద్ అర్బన్: డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణంలో ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోందని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ దార్ల శివరాజ్ విమర్శించారు. జిల్లా కేంద్రంలోని వేల్పుల సత్యనారాయణ కాలనీలో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను పార్టీ నాయకులు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా శివరాజ్ మాట్లాడుతూ 160 ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి నాలుగేళ్లు కావొస్తున్నా నేటికీ ప్రారంభ దశలోనే ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే, ఎస్సీ, ఎస్టీ, బీసీ, కార్పొరేషన్ల నిధులను ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని, నాలుగేళ్ల నుంచి కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయడం లేదని ఆరోపించారు. ఇకనైనా డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసి అర్హులకు కేటాయించాలన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తగరం నాగన్న, నాయకులు దార ప్రసాద్‌రావు, ఐనాల పరశురాములు, తోకల నాగరాజు, గుగులోత్ శేఖర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

108లో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం వైద్యవిభాగం: 108 వాహనంలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్(ఈఎంటీ), డ్రైవర్ (పైలట్) ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 15న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తల్లాడలోని 108 కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

లక్ష్య సాధనకు ఇదే కీలక సమయం

- రోజుకు 2.3 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయాలి
- జీఎంలకు డైరెక్టర్ల ఆదేశం


వీసీలో మాట్లాడుతున్న సింగరేణి డైరెక్టర్లు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించాలంటే ప్రతీ రోజు 2.3 టన్నులకు తగ్గకుండా బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయాలని, ఇందుకోసం ఏరియా జీఎంలు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని ఫైనాన్స్, ఈఅండ్ఎం, ఆపరేషన్స్, పీఅండ్‌పీ డైరెక్టర్లు ఎన్.బలరాం, సత్యనారాయణరావు, ఎన్‌వీకే శ్రీనివాస్, పి.వెంకటేశ్వర్‌రెడ్డి ఏరియా జీఎంలను ఆదేశించారు. సోమవారం వారు సింగరేణి ప్రధాన కార్యాలయం నుంచి 11 ఏరియాల జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకా మిగిలి ఉన్న 47 రోజుల్లో ప్రతి నిమిషం అత్యంత కీలకమని అన్నారు. రక్షణతో కూడిన నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి సాధించాలని, తద్వారా లక్ష్యాన్ని సాధించవచ్చని చెప్పారు. ఉత్పత్తితో పాటు రవాణా, ఓబీ కూడా ముఖ్య మేనని చెప్పారు. ఏరియాల వారీగా జీఎం ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ అధికారులు, ఏజెంట్లు, మేనేజర్లతో సమీక్ష నిర్వహించి రోజుకు 17 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తొలగించాలని సూచించారు. ఓబీ తొలగింపుతో బొగ్గు ఉత్పత్తికి మార్గం సుగమం అవుతుందన్నారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జె.ఆల్విన్, భూపాలపల్లి అడ్వయిజర్ (మైనింగ్)డీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ కష్టాలు తీర్చండి..



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ శ్రీరంగారావు, పక్కన సభ్యులు

- ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినా పట్టించుకోవడం లేదు
- విద్యుత్ నియంత్రణ మండలి ఎదుట వినియోగదారుల ఆవేదన
- పరిష్కారానికి చైర్మన్ శ్రీరంగారావు హామీ

నెహ్రూసెంటర్: 'కరెంట్ కష్టాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. వ్యవసాయానికి ఇచ్చే కరెంట్ కోతలు పెడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే మరమ్మతులు ఆలస్యమవుతున్నాయి. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలి' అని తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ ఎదుట పలువురు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు అన్ని సమస్యలను పరిష్కరిస్తామని చైర్మన్ శ్రీరంగారావు హామీ ఇచ్చారు. మహబూబాబాద్‌లో కలెక్టరేట్‌లో సోమవారం విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యాన వినియోగదారుల ముఖాముఖి ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు, ప్రజలు మాట్లాడుతూ విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటు, మిడిల్ పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, వ్యవసాయానికి 24గంటల పాటు విద్యుత్ సరఫరా, ఏసీడీ చార్జీల రద్దుపై విన్నవించారు. అలాగే, కొత్త మీటర్లు మంజూరు చేసి విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన వారికి ఎక్స్‌గ్రేషియా పెంచాలని కోరారు. ఈసమావేశంలో తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి సభ్యులు మనోహర్‌రాజు, బండారు కృష్ణయ్య, ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లు మోహన్‌రెడ్డి, గణపతి, సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణతో పాటు అధికారులు తిరుమలరావు, జె.నరేష్, పి.విజయ్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

టెస్టింగ్ సెంటర్ కావాలి

మీటర్ టెస్టింగ్ కోసం హనుమకొండకు వెళ్లాల్సి వస్తున్నందున జిల్లాలో సెంటర్ ఏర్పాటు చేయాలని వినియోగదారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి మైస శ్రీనివాసులు సూచించారు. అలాగే, ఏసీడీ చార్జీలపై సరైన నిర్ణయం ప్రకటించి వినియోగదారులకు అదనపు చార్జీలపై అవగాహన కల్పించాలని సూచించారు. తొర్రూరు జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాల్లో మృతి చెందిన వారికి సంస్థ ఇస్తున్న నష్టపరిహారాన్ని రూ.10 లక్షలకు పెంచాలని కోరారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్‌పై అవగాహన కల్పించి వినియోగించుకునేలా చూడాలన్నారు. ఇళ్లపై ఉన్న విద్యుత్ లైన్లను తొలగించాలని సూచించారు.